www.prajasakti.com

# ప్రజాశక్తి

గురువారం 4 సెప్టెంబరు 2025





## జిల్లా రవాణాధికారిగా కృష్ణారావు

**భీమవరం :** జిల్లా రవాణాధికారిగా కెఎస్ఎంవి.కృష్ణారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక కలెక్టరేట్లో బుధవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని డిటిఒ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల బస్సులన్నీ ఫిట్నెస్‌గా ఉండేలా తనిఖీలు నిర్వహించాలన్నారు. రహదారుల భద్రతకు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా రవాణాధికారిగా బాధ్యతలు చేపట్టిన కృష్ణారావు ఏలూరు జిల్లా నుండి బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఉమామహేశ్వరరావు గత నెల 31న ఉద్యోగ విరమణ పొందారు.



కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న కృష్ణారావు

## ట్రంప్ బాదుడుతో..

# రొయ్య ధర పతనం..!



**50 శాతం సుంకాల అమలుతో పరిస్థితి దారుణం**

**ధరలను శాసిస్తున్న ప్రాసెసింగ్ కంపెనీలు**

**ప్రతి కౌంట్‌పైనా రూ.30 నుంచి రూ.100 వరకూ తగ్గుదల**

**కౌంట్‌ను బట్టి ఎకరాకు రూ. 40 వేల నుంచి రూ. 2 లక్షల వరకూ నష్టం**

**ప్రభుత్వాలు పట్టించుకోకపోతే సాగు ప్రశ్నార్థకం**

**ఆందోళనలో ఆక్వా రైతాంగం**

**ప్రజాశక్తి - భీమవరం**

అంతర్జాతీయ విపణిలో 'డాలర్ల' సిరులు కురిపించే ఆక్వా రంగం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దెబ్బకు విలవిల్లాడుతోంది. 50 శాతం సుంకాలు విధించడంతో ఆక్వా రైతుకు తీవ్ర నష్టం కలుగుతోంది. ఈ బూచిని చూపిస్తూ దళారులు దోపిడీకి తెరతీశారు. రోజురోజుకీ ధరలు పతనమవుతుండటంతో రైతు పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ప్రస్తుత తరుణంలో సాగు చేయాలా, వద్దా.. చేస్తే ఎలా చేయాలనే గందరగోళంలో పడిపోయాడు.

ట్రంప్ మరోసారి 50 శాతం సుంకాల విధింపు ఆక్వా రైతులకు తీవ్ర నష్టాన్ని చేకూరుస్తోంది. సీడ్, ఫీడ్, వైరస్, విద్యుత్ బిల్లులు, అధిక పెట్టుబడులతో సతమతమవుతున్న ఆక్వా రైతాంగానికి ఈ సుంకాలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఏటా నాలుగు లక్షల టన్నుల రొయ్యలు ఉత్పత్తి అవుతున్నాయి. దీనిలో సుమారు 3.5 లక్షల టన్నుల వరకూ విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. భారత్ నుంచి విదేశాలకు ఎగుమతవుతున్న మాంసాహార ఉత్పత్తుల్లో రొయ్యలది మూడో స్థానం. ఆక్వా ఉత్పత్తుల ఎగుమతుల్లో రాష్ట్రంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాదే సింహభాగం. మొత్తంగా రూ.18 వేల కోట్ల వ్యాపారంలో విదేశీ లావాదేవీల వాటే అధికంగా ఉంది. అమెరికా ప్రకటించిన 50 శాతం సుంకాల అమలుతో ఆక్వారంగం ఒక్కసారి కుదేలైంది. ఈ పరిస్థితుల్లో తాము సాగు కొనసాగించలేమని ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పరిస్థితిని అర్థం చేసుకుని కేంద్ర ప్రభుత్వం రైతులపై సుంకాల భారం లేకుండా చేయాలని వారు కోరుతున్నారు. విదేశీ ఎగుమతులను ప్రోత్సహించడానికి కేంద్రం రాయితీ ఇవ్వాలి లేదా అమెరికాపై ఒత్తిడి చేసి సుంకం తగ్గించేలా చేయాలని అంటున్నారు. ఒక్కసారిగా రొయ్యల ధరలు పడిపోవడంతో ఇదే అదనుగా ప్రాసెసింగ్ యూనిట్లు, ఎక్స్‌పోర్ట్ ఏజెన్సీలు, మధ్యవర్తులు రొయ్యల కొనుగోలుకు షరతులు విధిస్తున్నారు.

**ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.2 లక్షల వరకూ నష్టం..**

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2.90 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. దీనిలో సుమారు 1.10 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. ఈ సాగులో 98 శాతం అమెరికా, చైనా, దుబాయ్ వంటి దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్రస్తుతం ఆక్వారంగం పరిస్థితులు తలకిందులయ్యాయి. వంద కౌంట్ రొయ్యలు కిలో రూ.270 ఉంటే ప్రస్తుతం రూ.230గా ఉంది. 60 కౌంట్ ధర రూ.305కు పడిపోయింది. ప్రతి కౌంట్‌కూ రూ.30 నుంచి రూ.100 వరకూ తగ్గింది. దీన్ని బట్టి చూస్తే సాగుదారులు ఎకరాకు రూ.40 వేల నుంచి కౌంట్‌ను బట్టి రూ.2 లక్షలు వరకూ నష్టపోతున్నారు. పంట చేతికందే దశలో ఒక్కసారిగా ధరలు పడిపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఈ పరిస్థితి ఎంతకాలం ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. అనుబంధ పరిశ్రమలపైనా ఈ ప్రభావం పడుతోంది.

**ధరలను శాసిస్తున్న ప్రాసెసింగ్ కంపెనీలు..**

మార్కెట్‌ను ఎక్స్‌పోర్టు చేస్తున్న ప్రాసెసింగ్ కంపెనీలు శాసిస్తున్నాయి. ధరలను తమకు ఇష్టం వచ్చినట్లు తగ్గించేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆక్వా సాగు నిలిపివేయడమేగాక అప్పులు తీర్చలేక ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరి మాయాజాలం కారణంగా నెల రోజుల్లో ధరలు భారీగా పడిపోయాయి. 25 కౌంట్ రొయ్య ధర కేజీ రూ.680 పలికింది. ట్రంప్ నోట టారిఫ్ మాట వచ్చిందో, లేదో వ్యాపారులు సిండికేటయ్యి ధరలు అమాంతం తగ్గించేశారు. ప్రస్తుతం 25 కౌంట్ రొయ్య ధర కేజీ రూ.460, 30 కౌంట్ ధర కేజీ రూ.395, వనామీ రకం 30 నుంచి 40 కౌంట్ రూ.370, 100 కౌంట్ ధర కేజీ రూ.220 పలుకుతోంది. ఈ ధరలు ఇంకా పతనమైతే రైతులు రొయ్యల సాగు మానడం తప్ప వేరే గత్యంతరం లేదని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ధరలు తక్కువ ఉన్నప్పటికీ కొనుగోలుకు వ్యాపారులు ముందు రావడం లేదు. పెద్ద రైతులు మాత్రమే కొంతవరకూ అమ్ముకోగలుగుతున్నారు. చిన్న, సన్నకారు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

**ఖర్చులు రావడం గగనమే..**

ప్రస్తుతం చెరువుల లీజు, విద్యుత్ ఛార్జీలు, ఫీడ్ ధరలతో 100 కౌంట్ రావాలంటే కిలోకు రూ.290 నుంచి రూ.280 ఖర్చవుతుంది. అదే 50 కౌంట్‌కు చేరాలంటే కిలోకు రూ.340 నుంచి రూ.300, గరిష్టంగా 30 కౌంట్‌కు రావాలంటే కిలోకు రూ.460 నుంచి రూ.500 ఖర్చవుతుంది. అదే 20 కౌంట్ రావాలంటే రూ.500పైనే ఖర్చవుతుంది. ఎకరా సాగుకు సీడ్, సాగుకు అవసరమైన హెల్త్‌కేర్ మినరల్స్, కరెంటు ఛార్జీలు, కూలీ ఖర్చులు అన్నీ కలుపుకుని సుమారు రూ.7.50 లక్షలు వ్యయమవుతుంది. ధరలు ఇంకా పతనమైతే రైతులు ఆర్థికంగా కుదేలు కావాల్సిందేననే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

**మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించాలి..**

ప్రస్తుతం మార్కెట్లో ధరల ప్రకారం రైతుకు కష్ట కాలమే. కూటమి ప్రభుత్వం జోక్యం చేసుకుని మార్క్‌ఫెడ్ ద్వారా రొయ్యల కొనుగోలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. లేనిపక్షంలో వ్యాపారులపై ఒత్తిడి చేసి ధరలు పెరిగేలా చేస్తే తప్ప ప్రస్తుత పరిస్థితుల్లో రొయ్య రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

## జల జీవన్ మిషన్ పనులు వేగవంతం

### కలెక్టర్ చదలవాడ నాగరాణి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

**ప్రజాశక్తి - భీమవరం**

జిల్లాలో జల జీవన్ మిషన్ పనులు వేగవంతం చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్, జల జీవన్ మిషన్ అమలు, నిర్వహణపై బుధవారం ఢిల్లీ నుంచి డిపార్ట్మెంట్ ఆఫ్ డ్రింకింగ్ వాటర్ అండ్ శానిటేషన్ సెక్రటరీ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ నాగరాణి, డిఆర్ఒ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి బివి.గిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జెజెఎం వర్క్ జరుగుతున్న సాంకేతిక ఇబ్బందుల వల్ల ఆన్‌లైన్ అప్‌డేట్ చేయడానికి సాధ్యం కావడం లేదని, సాంకేతిక ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. జెజెఎం వెబ్‌సైట్‌లో తాగునీటి వసతులు కల్పించిన పాఠశాలలు, అంగన్వాడీల డేటా వ్యత్యాసంగా చూపిస్తోందని డిడబ్ల్యుఎంఎస్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లారు.

## జిల్లా కేంద్రం ఏర్పాటుపై కూటమి వైఖరి చెప్పాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

**ప్రజాశక్తి - భీమవరం**

పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరేట్ ఏర్పాటుపై కూటమి పార్టీల వైఖరి ఏంటో చెప్పాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూడేళ్ల క్రితం పూర్తయిన అంశాన్ని అధికార పార్టీ ఎందుకు వివాదం చేస్తోందని ప్రశ్నించారు. ఒకే పార్టీ ఒక్కో చోట ఒక్కో మాట చెప్పి ప్రజలను మభ్య పెట్టడం సరికాదని తెలిపారు. ఎన్నో వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ఇంకా అనేక వాగ్దానాలు అమలు చేయాల్సి ఉందని, వాటి అమలు కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వంపై ఆందోళనలను చేయకుండా ప్రజల దృష్టి మళ్లించేందుకే ఇలాంటి వివాదాస్పద అంశాలను సృష్టిస్తున్నారనే అనుమానం వ్యక్తం అవుతోందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఊహాగానాలకు, వివాదాలకు తెరదించి జిల్లా కేంద్రం ఏర్పాటుపై స్పష్టమైన ప్రకటన చేయాలని తెలిపారు. శాశ్వత భవన నిర్మాణాలు ప్రారంభించి వివాదాలు తలెత్తకుండా స్వస్తి పలకాలని కోరారు.

## భవ్య భీమవరం అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

### జెసి రాహుల్ కుమార్ రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

**ప్రజాశక్తి - భీమవరం**

భవ్య భీమవరం అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జెసి భవ్య భీమవరం అభివృద్ధి పనులపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. వివిధ ప్రదేశాలలో చేపట్టిన పనులు పురోగతి, పింక్ టాయిలెట్స్ నిర్మాణానికి తీసుకున్న చర్యలపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులను ఆరా తీశారు. భీమవరం పట్టణం పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చేపట్టిన పనులు సత్వరమే పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పార్కుల అభివృద్ధి పింక్ టాయిలెట్స్ ఏర్పాట్లపై క్షేత్రస్థాయికి వెళ్లి అవసరమైన స్థలాలను పరిశీలించాలని ఆర్‌డిఒ కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డిని ఆదేశించారు. పింక్ స్థల పరిశీలన జాప్యం చేయడంపై టిపిఒ, మున్సిపల్ సర్వేపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, జిల్లా టూరిజం శాఖ అధికారి వెంకట అప్పారావు, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ ఎ.రాంబాబు, మున్సిపల్ డిఇ టి.త్రినాథ్‌రావు, ఆర్‌అండ్‌బి ఎస్‌సి ఎ.శ్రీనివాసరావు, ఎలక్ట్రికల్ డిఇ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## వశిష్ట గోదావరి తగ్గుముఖం

### ఊపిరి పీల్చుకున్న లంక గ్రామాల ప్రజలు



కోడేరు వద్ద తగ్గుముఖం పట్టిన వశిష్ట గోదావరి

**ప్రజాశక్తి - ఆచంట**

వారం రోజులుగా పెరుగుతూ వచ్చిన వశిష్ట గోదావరి బుధవారం కాస్త శాంతించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ గోదావరి తగ్గుముఖం పట్టింది. కోడేరులో పుష్కర ఘాట్లో దాదాపు మూడు అడుగుల మేర వరద నీరు తగ్గింది. వరద తగ్గుముఖం పట్టడంతో లంక గ్రామాల ప్రజలతో పాటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. తహశీల్దార్ జి.కనకరాజు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు వరద సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. వల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ హైందవి ఆధ్వర్యంలో కోడేరు, పెదమల్లం పర్యాటక కేంద్రం, పెదమల్లం ఆనగార్లలంక, పల్లిపాలెం, భీమలాపురం, కాపుల పాలెం, అయోధ్యలంక, పుచ్చలంక గ్రామాల్లో వైద్య సిబ్బంది మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో వరద ఇంకా ఉధృతంగానే ఉండడంతో లంక గ్రామాల మధ్య పడవ ప్రయాణాలకు అధికారులు అనుమతులు ఇవ్వలేదు. దీంతో లంక వాసులకు రాకపోకలు లేకుండా పోయాయి. లంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో కూరగాయలు పండించిన రైతులను మాత్రం వరద తీవ్ర నష్టాల బారిన పడేలా చేసింది. ముందస్తు చర్యల్లో భాగంగా కోడేరు, పెదమల్లం, కరుగోరుమిల్లి, భీమలాపురం గ్రామాల్లో ఇంజిన్ పడవలను అధికారులు అందుబాటులో ఉంచారు. ఎస్ఐ కె.వెంకటరమణ ఆధ్వర్యంలో పుష్కర ఘాట్ల వద్ద పోలీసు బందోబస్తు కొనసాగుతోంది. లంక గ్రామాల్లో పోలీసులు పహారా కాస్తున్నారు.

**పెనుగొండ రూరల్ :** వారం రోజులుగా గోదావరికి వరద నీరు పోటెత్తడంతో సిద్ధాంతం మధ్యస్థ లంక భూముల్లో పంటలన్నీ నీట మునిగాయని లంక గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం ఉదయం నుంచి గోదావరి తగ్గుముఖం పట్టడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

## మెసేజీలు పంపిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

### నల్ల బ్యాడ్జీలు ధరించి సిపిఎం నేతల నిరసన - అంబేద్కర్ విగ్రహానికి వినతి



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

**ప్రజాశక్తి - మొగల్తూరు**

రహదారి నిర్మాణం చేయకుండానే చేసినట్లు మెసేజీలు పంపిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల కమిటీ సభ్యులు ఎడ్ల చిట్టిబాబు మాట్లాడారు. ప్రతి సోమవారమూ నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యల పరిష్కరించకుండానే పరిష్కారమైనట్లు మెసేజీలు పంపడం దారుణం అన్నారు. సబ్ కలెక్టర్, కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మొగల్తూరు నుంచి వెంప రోడ్డు నిర్మించాలని వినతిపత్రం అందించినా నేటికీ పరిష్కారం కాకపోవడం దారుణం అన్నారు. రహదారి సమస్య పరిష్కరించినట్లు అధికారులు మెసెజ్‌లు పంపడం విడ్డూరంగా ఉందన్నారు. అటువంటి వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు కొత్తపల్లి నాగరాజు పలువురు నాయకులు ఉన్నారు.

## అందుబాటులో 4,315 మెట్రిక్ టన్నుల యూరియా

**మరో వారం రోజుల్లో 2250 మెట్రిక్ టన్నుల సరఫరాకు చర్యలు**

**యూరియా సరఫరాలో ఇబ్బందులపై కంట్రోల్ రూమ్ ఏర్పాటు**

**కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**ప్రజాశక్తి - భీమవరం**

జిల్లాలో 4315 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. మరో వారం రోజుల్లో 2250 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. జిల్లాలో 2,15,000 ఎకరాల్లో వరి, 25 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారన్నారు. ఈ పంటలకు ఖరీఫ్ కాలానికి 21,270 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని, ఇప్పటివరకు 20,310 మెట్రిక్ టన్నులు జిల్లాకు వచ్చిందని తెలిపారు. దీనిలో రైతులు ఇప్పటి వరకు 18,329 మెట్రిక్ టన్నుల కొనుగోలు చేశారని పేర్కొన్నారు. యూరియాపై కొంతమంది సృష్టించిన ఆపోహలతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. యూరియాకు సంబంధించి జిల్లాలో ఎటువంటి ఇబ్బందీ లేదని, రైతులు వదంతులను నమ్మొద్దని కోరారు. ప్రయివేట్ డీలర్ల అమ్మకాలపైన ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 6ఎ కేసులు 13 నమోదు చేసి రూ.16.86 లక్షల విలువైన 76.65 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. యూరియా సరఫరా పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు యూరియా సరఫరాలో ఏమైనా అనుమానాలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 8121676653ను సంప్రదించాలని సూచించారు.

## విఒఎల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు

**ప్రజాశక్తి - ఇరగవరం (తణుకు)**

జియోట్యాగ్ ఫోన్లు ఏర్పాటు చేసి పలు రకాల యాప్లు ఇచ్చి ఉదయం నుండి రాత్రి వరకు పనులు చేయిస్తున్న ఐకెపి, విఒఎల సమస్యలు పరిష్కరించాలని ఇరగవరం మండల విఒఎల సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఇరగవరం వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో పిల్లి వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్లు ఇచ్చి కార్మికులను కట్టు బానిసలుగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేయిస్తుందని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకుండా కార్మికులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తిండి గింజలు, ఇల్లు, విద్య, వైద్యం వంటి మౌలిక అవసరాలు ప్రతి కుటుంబానికి హక్కుగా అందజేయాలని దాని కోసమే సిఐటియు పోరాడుతుందని అన్నారు. కార్మికులు తమ సమస్యల పరిష్కారంతోపాటు కనీస వేతనం అమలు చేసేలా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిఐటియు నాయకులు నాగిశెట్టి గంగారావు మాట్లాడారు. సమావేశంలో విఒఎల జిల్లా నాయకులు గడ్డం లక్ష్మి, మండలంలోని విఒఎలు పాల్గొన్నారు.

## 6 నుంచి అంతర్జాతీయ లఘు చలన చిత్ర పోటీలు

**ప్రజాశక్తి - పాలకొల్లు**

ఈనెల 6వ తేదీ నుంచి పాలకొల్లులో ప్రారంభమయ్యే 4వ అంతర్జాతీయ లఘు చలనచిత్ర పోటీల్లో 12 చిత్రాలు ఎంపికైనట్లు మాజీ ఎంపీ చేగొండి హరరామ జోగయ్య చెప్పారు. ఆయన నివాసంలో బుధవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. తీరం చేరని కెరటం, చివరి శ్వాస, పదిలం, మమ్మీ మహాలక్ష్మి, సైబర్ స్లేవరీ, నీ కోసం, సమతుల్యం, దియా, సరిహద్దు, మార్పు నీకోసం కాదు రేపటి కోసం, 733, బాలిగాడు చిత్రాలు ఎంపికైనట్లు చెప్పారు. మరో 6 చిత్రాలు ప్రత్యేక జ్యూరీ ప్రదర్శనకు ఎంపికైనట్లు చెప్పారు. మధులిక, చిన్ని, చిన్ని మనసులు, మైత్రి, దేశానికి రైతే ప్రాణం, కనిపించని త్యాగం, జయహో ఎంపికైనట్లు చెప్పారు. ప్రదర్శనలు రామచంద్ర గార్డెన్స్‌లో ఉంటాయని ఈ సందర్భంగా ప్రముఖ సినీ దర్శకుడు బి.గోపాల్, సినీ నిర్మాతలు తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, చెరుకూరి శ్రీనివాస్ రాజులకు జీవిత సాఫల్య పురస్కారాలు ఇస్తున్నట్లు చెప్పారు. ప్రారంభ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, శాసనసభ డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు పాల్గొంటారని జాతీయ తెలుగు సారస్వత పరిషత్ అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్ చెప్పారు. కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ఎన్ వర్మ, డాక్టర్ కె.రాంప్రసాద్, గుడాల హరిబాబు, చవాకుల నరేష్ బాబు పాల్గొన్నారు.

## జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారిగా అరుణ కుమారి

**ప్రజాశక్తి - భీమవరం**



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న అరుణ కుమారి

జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారిగా ఎన్‌వి అరుణ కుమారి నియమితులయ్యారు. ప్రకాశం జిల్లా కొండపిలో సహాయ సాంఘిక సంక్షేమ అధికారిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడకు రావడం జరిగింది. స్థానిక కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని అరుణ కుమారి మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో మెరుగైన మౌలిక వసతులను కల్పించడం జరిగిందన్నారు. అన్ని వసతి గృహాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి చిన్న, చిన్న సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కరించాలన్నారు. వసతి గృహాల్లో చేరికలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు రామాంజనేయ రాజు, సీలం రాజశేఖర్ రెడ్డి, హెచ్‌డబ్ల్యుఒ ఎం.రత్నరాజు, సిహెచ్.భానుమణి, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## క్రీడా ప్రతిభ పురస్కారానికి మండపాక ఉన్నత పాఠశాల ఎంపిక

**తణుకు :** 2024-25 విద్యా సంవత్సరంలో మండపాక విద్యార్థులు క్రీడల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో సాధించిన విజయాలకు గాను క్రీడా ప్రతిభ అవార్డు-2025కు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.ఫణి శ్రీ తెలిపారు. జిల్లాలో సుమారు 250పైగా పాఠశాలలు ఉండగా మండలంలోని మండపాక పాఠశాలకు మొదటిసారి అవార్డు రావడం గ్రామానికి గర్వకారణం అని, విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు సంకు సూర్య నారాయణను, మండపాక గ్రామ సర్పంచి జానా వెంకటలక్ష్మి, వైస్ ప్రెసిడెంట్ జి.నగేష్, టిడిపి మండల అధ్యక్షులు ఆత్మకూరు రామకృష్ణ, జనసేన గ్రామ నాయకులు జానా శ్రీనివాస్, పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ గూడూరు మహాలక్ష్మి అభినందించారు.

## సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం

### సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి డి.కళ్యాణి

**ప్రజాశక్తి - గణపవరం**





మహాసభలో మాట్లాడుతున్న కళ్యాణి

డ్వాక్రా యానిమేటర్ల సమస్యల పరిష్కారానికి సిఐటియు ఆధ్వర్యాన పోరాటాలు చేయవలసిన అవసరం ఉందని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి డి.కళ్యాణి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక బిటి రణదివే భవనంలో జరిగిన డ్వాక్రా యానిమేటర్ల రెండవ మండల మహాసభలో పాల్గొని మాట్లాడారు. ఈ మహాసభకి ఎ.సుబ్బలక్ష్మి, ఎ.సుజాత, టి.పద్మావతి అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. సభలో కళ్యాణి మాట్లాడుతూ ప్రభుత్వం యానిమేటర్లపై పెనుభారాలు వేసి ఇబ్బందులు పెడుతుందన్నారు. ఆన్ లైన్, మొబైల్ ఫోన్స్‌లో పనులు వల్ల యానిమేటర్లు శారీరకంగా, మానసిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి ఇచ్చే వేతనం వారి బ్యాంకు ఖాతాలో వేయాలని కోరారు. సిఐటియు జిల్లా నాయకులు కె.ఝాన్సీ లక్ష్మి, మండల కార్యదర్శి ఎం.పెంటారావు, స్థానిక నాయకులు కె.త్రినాథ్, అంగన్వాడీ జిల్లా కార్యదర్శి ఎండి హసీనా బేగం మాట్లాడారు. అనంతరం మండల నూతన కమిటీ అధ్యక్షులుగా అడగర్ల సుబ్బలక్ష్మి, కార్యదర్శిగా పైలా నళిని, కోశాధికారిగా తోట పద్మావతి, మరో పది మందితో నూతన కమిటీ ఎన్నికైంది.

# ఎన్నికల వాగ్దానాలు అమలు చేయాలి

**చేనేత కార్మిక సంఘం ఉమ్మడి జిల్లా పూర్వపు కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు**

**8న చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రథమ మహాసభ**

**ప్రజాశక్తి - తణుకు**

అధికారంలో ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు చేనేత కార్మికులకు ఇచ్చిన వాగ్దానాల్ని తక్షణం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఉమ్మడి జిల్లా పూర్వపు కార్యదర్శి బళ్ల చిన వీరభద్ర రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా విడిపోయిన అనంతరం ఈనెల 8వ తేదీన ప్రముఖ చేనేత కేంద్రం పాలకొల్లు మండలం దగ్గులూరు గ్రామంలో వీవర్స్ కమ్యూనిటీ హాల్‌లో జరుగుతున్న చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత వృత్తిని నమ్ముకుని నేటికీ రెండు లక్షల మంది మగ్గాలపై పని చేసుకుంటూ ఉపాధి పొందుతున్నారన్నారు. చేనేత కార్మికులను ఆదుకోవలసిన పాలక ప్రభుత్వాలు చేనేత వృత్తిని, చేనేత సహకార వ్యవస్థను దెబ్బతీస్తూ పవర్ లూమ్ యజమానులకు రూ.కోట్ల రాయితీలు ఇస్తూ వారిని ప్రోత్సహించడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రతి ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు తమకు అధికారం కోసం చేనేత కార్మికులను ఓట్లు వేసే యంత్రాలుగా ఉపయోగించుకోవాలనే ఉద్దేశ్యంతో అనేక హామీలు ఇస్తున్నారని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత నేతన్నలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వాటిని విస్మరించడం తగదని వీరభద్రరావు అన్నారు. కాబట్టి చేనేత పరిశ్రమ వృత్తి పరిరక్షణకు చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను ఈ మహాసభలో చర్చించి భవిష్యత్తు కార్యచరణ రూపొందించేందుకు ఈ జిల్లా మహాసభ వేదిక కానున్నదని ఆయన తెలిపారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ జిల్లా మహాసభకు ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణతో పాటు జిల్లా నాయకులు హాజరవుతున్నారని, జిల్లా నలుమూలల నుండి చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వీరభద్రరావు విజ్ఞప్తి చేశారు.

## తణుకు ప్రాంతానికి గుర్తింపు తెచ్చిన 'ముళ్లపూడి'

**ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ వెల్లడి**

ప్రజాశక్తి - తణుకు

అనేక పరిశ్రమలు స్థాపించి, ఎంతో మందికి ఉపాధి కల్పించి ఆంధ్రా బిర్లాగా కీర్తిశేషులు డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ ప్రపంచ పటంలో తణుకు ప్రాంతానికి ఒక గుర్తింపు తీసుకువచ్చారని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. కీర్తిశేషులు ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం తణుకులో నిర్వహించారు. ఈ సందర్భంగా ముళ్లపూడి విగ్రహానికి పూలమాలలు వేసి ఎంఎల్ఎ రాధాకృష్ణ ఘనంగా నివాళులు అర్పించి మాట్లాడుతూ పారిశ్రామిక, సేవా, విద్యా, వైద్య రంగాలతోపాటు రాజకీయ రంగంలో తనదైన ముద్ర వేసుకున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు స్థాపించి వ్యవసాయాధారిత పరిశ్రమల ద్వారా ఎంతో మందికి ఉపాధి కల్పించినట్లు తెలిపారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

## మెడికల్ కోడింగ్‌పై వర్క్‌షాప్

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం డిగ్రీ కాలేజీలో బుధవారం సైన్సు విద్యార్థులకు మెడికల్ కోడింగ్ కెరీర్ అవకాశాలపై బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అధ్యక్షత వహించారు. వర్క్‌షాపులో పాల్గొన్న రిసోర్స్‌పర్సన్లు సబిహా(ట్రైనర్ డాట్ ప్లోస్), సుప్రజ(హెచ్ఆర్ మేనేజర్) మాట్లాడుతూ నేటి ప్రపంచ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో మెడికల్ కోడింగ్ ఒక ముఖ్యమైన కెరీర్ మార్గంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. వంద మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేశారు.

## స్వచ్ఛంద సేవా సంస్థలను పర్యవేక్షించాలి : జెసి

ప్రజాశక్తి - భీమవరం

ఆదరణ, సంరక్షణ అవసరమైన పిల్లల కోసం స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహిస్తున్న సంస్థలపై పర్యవేక్షణ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్లో జిల్లాస్థాయి స్వచ్ఛంద సేవల సంరక్షణ కమిటీ సభ్యులతో జెసి సమీక్షించారు. జిల్లాలో ప్రభుత్వ లైసెన్సు కలిగిన 12 స్వచ్ఛంద సేవా సంస్థలను ప్రతి మూడు నెలలకు ఒకసారి పర్యవేక్షణ చేసి వారికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయా లేవా తెలుసుకోవాలని సూచించారు. ఏమైనా లోటుపాట్లు ఉంటే వాటిని వెంటనే సరిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ లైసెన్సు నిరాకరించిన ఏడు స్వచ్ఛంద సేవా సంస్థలకు సంబంధించిన పిల్లలను చైల్డ్ ప్రొటెక్ట్ కమిటీ ద్వారా ఇతర హోంలకు, తల్లిదండ్రుల సంరక్షణలోకి అప్పచెప్పాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి డి.లక్ష్మి, డిసిపిఒ ఆర్.రాజేష్, సిడబ్ల్యుసి పి.వెంకటేశ్వరరావు, డాక్టర్ బిందు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సతీష్, అడ్వకేట్ చిత్రభాను పాల్గొన్నారు.

## పలుచోట్ల పొలం పిలుస్తోంది

**గణపవరం** : మండలంలోని ముప్పర్తిపాడులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎడిఎ గంగాధర్ మాట్లాడుతూ పురుగు కాని, తెగులు కాని కనపడకుండా ముందస్తు పిచికారీ చేయవద్దని సూచించారు. రైతులకు యూరియా అందుబాటులో ఉందని చెప్పారు. యూరియా స్థానిక సొసైటీ ఆర్ఎస్‌కెలలో ఎక్కువగా పెడుతున్నామని తెలిపారు. మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ డ్రోన్లు 80 శాతం రాయితీపై అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కావలసిన రైతులు తమని సంప్రదించాలన్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ మెరుగు హవీలా, రైతులు పాల్గొన్నారు.

**నరసాపురం:** నవరసపురం, మాధవాయిపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి అడబాల జ్యోషిల మాట్లాడుతూ నీట మునిగిన పొలాలలో నీరు తీసిన వెంటనే 20 కేజీల యూరియా 10 కేజీల పోటాష్ ఎరువులు వేసుకోవాలని సూచించారు. వ్యవసాయ సహాయకులు విజయ హన్నా, సేంద్రీయ వ్యవసాయ సిబ్బంది జ్యోతి, పెద్దింట్లమ్మ పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ అందజేత

**తణుకు** : కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తూ వారి సంక్షేమానికి కట్టుబడి ఉందని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి నియోజకవర్గంలోని 66 మంది లబ్ధిదారులకు రూ.35.91 లక్షల విలువైన చెక్కులను బుధవారం బాధితులకు అందజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చంద్రబాబునాయుడు ఆరోగ్యం, వైద్యానికి పెద్ద పీట వేస్తూ వైద్యం అందడం లేదని ఎవరూ నిరాశ చెందకుండా ఉండేలా ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పలు పాఠశాలల తనిఖీ

**ఉండి** : విద్యార్థులకు చదువుతోపాటు క్రమశిక్షణ చాలా అవసరమని మండల విద్యాశాఖాధికారి బి.జ్యోతి అన్నారు. బుధవారం మండలంలోని పాములపర్రు, పులిగుమ్మ పాఠశాలలను వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కౌమార దశలోనే క్రమశిక్షణను నేర్చుకుంటారని, దానివల్ల భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని అన్నారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం వంటి వాటిని పరిశీలించడం జరిగిందని, విద్యార్థులు ప్రభుత్వం అందించే పౌష్టికాహార భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇవ్వడం జరిగిందని వారు వివరించారు.

## దసరా మహోత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

**తాడేపల్లిగూడెం:** శ్రీబలుసులమ్మ అమ్మవారి దసరా మహోత్సవ ఆహ్వాన శుభ పత్రికను విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దసరా అన్నదానం నిమిత్తం రూ.9,116 ఎంఎల్ఎ విరాళం ఇచ్చారు. బిజెపి తాడేపల్లిగూడెం కన్వీనర్ ఈతకోట తాతాజీ మాట్లాడుతూ బలుసులమ్మ ఆలయంలో సాంప్రదాయబద్ధంగా జరిగే దసరా ఉత్సవాలలో భక్తులు బలుసులమ్మ అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో బలుసులమ్మ ఆలయ నిర్వాహకులు శ్రీరంగం అంజిబాబు, దాట్ల రాజా, పాలూరి వెంకటేశ్వరరావు, నీలం సురేష్, కళ్ల గోపికృష్ణ, పట్నాల రాంపండు, దాట్ల జగన్నాథరాజు, రాంబాబు, కర్నాలు రామచంద్రరావు, నిమ్మకాయల సత్యనారాయణ పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహమూర్తికి సన్మానం

**పెనుగొండ రూరల్** : మండలంలోని వడలి గ్రామంలో ఉద్యోగ విరమణ పొందిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బచ్చు లక్ష్మీనరసింహమూర్తి సన్మాన కార్యక్రమం బుధవారం వడలి గ్రామదేవత శ్రీమదాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సాంప్రదాయ కళావేదిక వద్ద నిర్వహించారు. ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పెనుగొండ మండలం ఉపాధ్యాయ సిబ్బంది, డిప్యూటీ మురళీ సత్యనారాయణ, ఇరగవరం ఎంఇఒ శ్రీనివాస్, పెనుగొండ ఎంఇఒ రామకృష్ణ పాల్గొన్నారు.

## పట్టణ ప్రజలకే నీరు లేదు..

**వైసిపి నాయకుల ఆందోళన**

**భీమవరం టౌన్:** పట్టణ ప్రజలకే సరైన తాగునీరు అందించలేకపోతున్నారని అలాంటిది పక్క నియోజకవర్గ ప్రజలకు నీటిని ఎలా ఇస్తారని వైసిపి నాయకులు విమర్శించారు. బుధవారం పైప్‌లైన్ నిర్మాణం వద్ద ఆందోళన నిర్వహించారు. భీమవరం మున్సిపాలిటీ మంచినీటిని ఉండి నియోజకవర్గంలోని విస్సా కోడేరు గ్రామానికి పైప్‌లైన్ ద్వారా తరలించడంపై భీమవరం వైసిపి విభాగం, మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు మంచినీటి తరలింపుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సంఘటన స్థలం వద్ద ఆందోళన చేశారు. భీమవరం మున్సిపాలిటీ పరిధిలోని మంచినీరు పట్టణ ప్రజలకే సరిపోవడం లేదని, వర్షాకాలంలో కూడా మున్సిపాలిటీ పరిధిలోని భీమవరం ప్రజలకు పూర్తిస్థాయిలో మంచినీటిని అందించలేక పోతున్నారని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కామన నాగేశ్వరరావు ఆరోపించారు. అంతే ఉన్నత అధికారులు ఇచ్చిన మెమోలో భీమవరం ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీటిని ఇచ్చిన తర్వాత ఇంకా మంచినీరు నిలవ సామర్ధ్యం ఉంటే అప్పుడు ఇతర ప్రాంతాలకు మున్సిపల్ వాటర్‌ను ఇవ్వొచ్చని ఉన్నప్పటికీ, కాని మున్సిపల్ అధికారులు భారీ అవినీతికి పాల్పడి పట్టణ ప్రజలకు తాగునీటిని పూర్తిగా అందించకుండా వేరే నియోజకవర్గానికి పైప్ లైన్ ద్వారా మంచినీటిని అందిస్తున్నారని మండిపడ్డారు. కచ్చితంగా ఎంఎల్ఎ అంజిబాబు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వైసిపి పట్టణ నాయకులు గాదిరాజు రామరాజు, పాలవల్లి మంగ, బొసారపు సాయి పాల్గొన్నారు.

## జూనియర్ కాలేజీలో ఫ్రెషర్స్ డే వేడుకలు

**గణపవరం** : గణపవరం జూనియర్ కాలేజీలో బుధవారం ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ (ఎఫ్ఎసి) శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలని అన్నారు. క్రమశిక్షణతో ఉండటం ద్వారా కాని లక్ష్యాలను చేరవచ్చని చెప్పారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అధ్యాపకులు ప్రేమలత, సీతామహాలక్ష్మి, సాయిబాబా, కిరణ్ బాబు, స్వామి దొర పాల్గొన్నారు.





పాలకోడేరు ఎంఇఒను సత్కరిస్తున్న ఎస్‌టియు నేతలు

## ఎంఇఒలకు ఎస్‌టియు అభినందన

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం, పాలకోడేరు మండలాల విద్యాశాఖాధికారులు-2 గా నియామకమైన కొల్లి సాయిరాం, హరి ఆనంద ప్రసాద్‌ను ఎస్‌టియు ఉపాధ్యాయ సంఘం అభినందించింది. తొందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న సాయిరాం, గరగపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న హరి ఆనంద ప్రసాద్ విద్యాశాఖ అధికారులుగా ఉద్యోగోన్నతి పొందారు. దీనిలో భాగంగా భీమవరం, పాలకోడేరు విద్యాశాఖ కార్యాలయాల్లో విద్యాశాఖ అధికారులుగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి పిఆర్‌విఎస్.సాయి వర్మ, జిల్లా ఫైనాన్స్ సెక్రటరీ పివిడి.ప్రసాద్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కోసూరు కృష్ణంరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు, కార్యదర్శులు లెనిన్, ఎస్.శేషయ్య, విశ్వనాథరాజు, మండల శాఖ అధ్యక్షులు పంపన శ్రీనివాస్, మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఎ.సూర్యనారాయణ నూతనంగా బాధ్యతలు చేపట్టిన మండల విద్యాశాఖ అధికారులకు పుష్ప గుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు.

## మెరుగైన వైద్య సేవలందించాలి

**జిల్లా వైద్యాధికారి డాక్టర్ గీతాబాయి**

ప్రజాశక్తి - ఉండి

ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యాధికారి డాక్టర్ గీతాబాయి అన్నారు. బుధవారం మండలంలోని యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డాక్టర్ గీతాబాయి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి ఇన్ పేషెంట్, అవుట్ పేషెంట్, ఎలక్ట్రో హెల్త్ రికార్డులను, రోగులకు అందించే వైద్య సేవలపై ఆరా తీశారు. ఫార్మసీ గది, వాక్సినేషన్ గది, ఆసుపత్రి పరిసరాలను తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రోగులకు అందుబాటులో ఉండాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలకు కృషి చేయాలని, తప్పని పరిస్థితుల్లోనే సిజేరియన్‌కు వెళ్లేలా గర్భిణులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆసుపత్రి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బెన్నీ శామ్యూల్, పిహెచ్ఎన్ ఎం.దుర్గాకుమారి, ఎంపిహెచ్ఎస్ ప్రియదర్శిని, స్టాఫ్ నర్సులు మేరీమాత, అనూష, సిబ్బంది ఉన్నారు.

## నెల రోజుల పాటు గాలికుంటు వ్యాధి టీకాలు

**జిల్లా పశువర్ధక శాఖ అధికారి మురళీకృష్ణ**

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఈనెల 15వ తేదీ నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు జిల్లా పశువర్ధక శాఖ అధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆవుజాతి, గేదెజాతి పశువులకు టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు పేర్కొన్నారు. గాలికుంటూ వ్యాధి సోకిన పశువులకు పాల ఉత్పత్తి సామర్థ్యం గణనీయంగా తగ్గిపోతుందన్నారు. తీవ్రమైన జ్వరం, నీరసం, నోటి నుండి చొంగ కారుట, నోరు, కాలు, గిట్టలు మధ్య పుండ్లు, చూడి పశువులు ఈసుకుపోవడం, కొద్దిపాటి ఎండకు రొప్పడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. వైద్యం నిర్లక్ష్యం చేస్తే పశువులు చనిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. తప్పకుండా టీకా వేయించాలన్నారు.

## ఐక్య పోరాటాలతోనే హక్కుల సాధన

**సిఐటియు నాయకులు పి.మోహన్ రావు**

**ఆచంట** : ఐక్య పోరాటాలతోనే హక్కులను సాధించుకోగలమని సిఐటియు నాయకులు పి.మోహన్ రావు అన్నారు. ఈనెల 8వ తేదీన తాడేపల్లిగూడెంలో జరుగుతున్న అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో కోలాటంపై ప్రజా నాట్యమండలి నాయకులు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బండి రంగారావు, కుసుమ జయరాజు, ప్రజానాట్యమండలి నాయకులు సిర్రా నరసింహమూర్తి, కొండేటి రాఘవులు, బి.ముకుందప్రియ, సిహెచ్.అరుణ, ఎ.జ్యోతి, యు.ప్రభావతి, సిహెచ్.నాగమణి ఉన్నారు.

## చికిత్సతో కేన్సర్ రోగులకు సాధారణ జీవితం

**వైద్య నిపుణులు గణేష్ జై శేత్వార్**

**భీమవరం టౌన్:** బ్లడ్ కేన్సర్ వచ్చినవారు సరైన టైంలో వైద్యులను సంప్రదించి ట్రీట్మెంట్ తీసుకుంటే 90 శాతం క్యూర్ అయ్యే ఛాన్సెస్ ఉన్నాయని హైదరాబాద్ యశోద హాస్పిటల్‌కి చెందిన ప్రముఖ బ్లడ్ కేన్సర్ నిపుణులు గణేష్ జై శేత్వార్ అన్నారు. బుధవారం భీమవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేన్సర్ అనేది రకరకాల రూపంలో ఉన్నాయని, దీనిలో బ్లడ్ కేన్సర్ అత్యంత ప్రమాదకరమైందని అన్నారు. మా ద్వారా అనేకమంది పేషెంట్లు చికిత్స తీసుకుని ఆరోగ్యవంతంగా ఉన్నారన్నారు.

# దాట్ల శ్రీదేవి ట్రస్ట్ సేవలు భేష్

ప్రజాశక్తి - కాళ్ల

డాక్టర్ దాట్ల వెంకటరామరాజు గ్రామాభివృద్ధితో పాటు అన్నదానాలు, పర్వదినాల వేళ ప్రత్యేక సేవా కార్యక్రమాలు ఇలా నిర్వహిస్తూ.. మానవ సేవే మాధవ సేవ అనే రీతిలో దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ద్వారా పలు కార్యక్రమాలు ఇప్పటికీ కొనసాగించడం అభినందనీయమని పలువురు వక్తలు అన్నారు. కాళ్లకూరు గ్రామం వెంకటాపురంలో నిర్మించిన సిమెంట్ రేవును గ్రామ సర్పంచి సాదు శ్రీదేవి శ్రీనివాస్ బుధవారం ప్రారంభోత్సవం చేశారు. దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ లక్ష రూపాయల ఆర్థిక సహకారంతో స్త్రీలకు ఉపయోగపడే విధంగా కాళ్లకూరు పంట కాలువలో సిమెంట్ రేవును నిర్మించారు. అదేవిధంగా వినాయక చవితి ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా అఖండ అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో


**సిమెంట్ రేవు ప్రారంభంలో వక్తలు**



సిమెంట్ రేవును ప్రారంభిస్తున్న సర్పంచి శ్రీదేవి

డాక్టర్ దాట్ల వెంకట రామరాజు, మాజీ ఎంపిపి ఆరేటి వెంకటరత్న ప్రసాద్, సర్పంచి సాదు శ్రీదేవి శ్రీనివాస్, ఆకివీడు డిసి ఛైర్మన్ గోకరాజు శివబాబు, అడ్డాల నాగరాజు, వేగేశ్న సత్యనారాయణరాజుతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

# విశ్వేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - ఉండి

సుమారు 400 సంవత్సరాల చరిత్ర కలిగిన మండలంలోని ఎన్ఆర్‌పి అగ్రహారం శ్రీవిశ్వేశ్వర స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం బుధవారం జరిగింది. నూతన ఛైర్మన్‌గా దొనేపూడి రాఘవేంద్ర, పాలకవర్గ సభ్యులుగా వానపల్లి రమేష్, కొల్లి శ్రీలక్ష్మి, గురువెల్లి వెంకటలక్ష్మి, లంక సుమతి, కడలి నాగ చంద్రకాంత్, ఆరిమిల్లి వెంకట పద్మజ, కన్నెగంటి ప్రభాకర్ రావు, కింజింగి సరస్వతి ఆలయ కార్యనిర్వహణాధికారి రామాంజనేయరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా దొనేపూడి రాఘవేంద్ర మాట్లాడుతూ సుమారు 400 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ ఆలయం ప్రతిష్టను మరింత పెంచేందుకు పాలకవర్గ సభ్యులతో కృషి చేస్తానన్నారు. స్థానిక ఎంఎల్ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు సూచనల మేరకు పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరిని సమన్వయం చేసుకుంటూ ఆలయాన్ని అభివృద్ధి చేసి ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలను అందజేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి సూరవరపు కనకదుర్గ వెంకటాచార్యులు, ఉప సర్పంచి ముగ్గళ్ల సత్యనారాయణ, టిడిపి గ్రామ అధ్యక్షులు కన్నెగంటి రూత్ కళ, మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, నాయకులు రణస్థుల మహంకాళి, కిన్నెర వెంకన్న, మున్నలూరి శ్రీనివాస్, కవురు కోటేశ్వరరావు, గుండాబత్తుల సుబ్బారావు, జనసేన గ్రామ అధ్యక్షులు కురిటి అప్పారావు పాల్గొన్నారు.

# పాఠశాలలో ముందస్తు గురుపూజోత్సవం..

**పాలకొల్లు** : పాలకొల్లులోని జివిఎస్ విఆర్ఎ మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్లో ముందస్తు గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మండల విద్యాశాఖ అధికారి-2 శర్మ మాట్లాడుతూ సమాజ నిర్మాతలుగా, భవిష్యత్తు తరాలకు దిక్సూచిగా ఉన్న ఉపాధ్యాయులందరికీ ముందస్తు గురుపూజోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో అమూల్యమైనదని, ఈనాడు సమాజంలో ఉపాధ్యాయుల పట్ల ఉన్న సమాజ వైఖరిని, అలాగే ఉపాధ్యాయ వృత్తిలో ఉండే బాధ్యతలను తెలియజేస్తూ ప్రభుత్వ ఉపాధ్యాయులుగా అర్హత పొందడం అంటే అది చాలా కష్టసాధ్యమైన విషయం అన్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాన్ని సంపాదించడం సామాన్య విషయం కాదని, పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ చక్కగా బోధిస్తున్నారని, దానిని విద్యార్థులందరూ



మున్సిపల్ స్కూల్లో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న తల్లిదండ్రులు

వినియోగించుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. ప్రయివేట్, ప్రభుత్వ పాఠశాలలకు ఉండే వ్యత్యాసాన్ని చక్కగా వివరించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను, ఈ పాఠశాలలో పనిచేస్తున్న హెచ్ఎం రాయపూడి భవాని ప్రసాద్ దాతలు ద్వారా కార్పొరేట్ పాఠశాలకు దీటుగా తయారు చేశారని అన్నారు. అనంతరం పిఎంసి ఛైర్మన్ కరణం పాపారావు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులను శాలువాలతో, పూలమాలలతో, పండ్లతో ఘనంగా సత్కరించారు.

# గ్రామాలాభివృద్ధికి కూటమి కట్టుబడి ఉంది: ఎంఎల్ఎ

ప్రజాశక్తి - తణుకు

తణుకు నియోజకవర్గంలో గ్రామాలాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. మండలంలోని దువ్వ నుంచి ముద్దాపురం గ్రామానికి వెళ్లే ఆర్అండ్‌బి రోడ్డుకు ఎంఎల్ఎ రాధాకృష్ణ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.1.50 కోట్లతో మొదటి విడత ముద్దాపురం వరకు, రెండో విడతలో రూ.5 కోట్లతో సీసీ రోడ్డు నిర్మాణంతోపాటు కోనాల వరకు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. కూటమి ప్రభుత్వంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి ఏడాదిలోనే ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో 90 శాతం అమలు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ అటు అభివృద్ధి, సంక్షేమాన్ని ఏకకాలంలో అమలు చేస్తున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వమన్నారు. తణుకు నియోజకవర్గంలో ముద్దాపురం, కోనాల గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఆయా గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వాడివేడిగా సర్వసభ్య సమావేశం

**పెనుమంట్ర** : పెనుమంట్ర మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపిపి కర్రి వెంకట నారాయణ రెడ్డి(వాసు) అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడి వేడిగా కొనసాగింది. మండల ప్రజల సమస్యలు, అధికారుల నిర్లక్ష్యం, అభివృద్ధి అంశాలపై ప్రజాప్రతినిధులు, నాయకులు ఘాటైన వ్యాఖ్యలు చేశారు. పిహెచ్‌సిల్లో డెలివరీలు తగ్గిపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్యలు తరచూ తలెత్తుతున్నా పరిష్కారం లేకపోవడంపై పలువురు గ్రామ సర్పంచులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రైతులకు అవసరమైన సమయంలో వ్యవసాయాధికారులు అందుబాటులో లేరని జుత్తిగ సర్పంచి తమనంపూడి వీర్రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే సరిదిద్దుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో కుక్కల సమస్యను అదుపులోకి తెచ్చేందుకు పశువైద్య శాఖ చర్యలు తీసుకోవాలని అనేక మంది నాయకులు విన్నవించారు. శ్మశాన వాటికలు డంపింగ్ యార్డులుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎంపిడిఒ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరిత పరిష్కారం తీసుకువస్తామని హామీ ఇచ్చారు. మహర్దశ నిధులు మంజూరైన విషయాన్ని అధికారులు నివేదికలో పేర్కొన్నారు. మొత్తంగా సర్వసభ్య సమావేశం సమస్యల వేదికగా మారి, అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య చర్చలు, వాగ్వాదాల దాకా వెళ్లాయి. తహశీల్దార్ వై.రవికుమార్, ఎంపిడిఒ ఎంఎస్.ప్రభాకర రావు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్

**కాళ్ల** : కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్ జారీ చేశామని ఆలయ ఇఒ ఎం.అరుణ్ కుమార్ బుధవారం తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు సంబంధిత ఆలయ కార్యాలయంలో దరఖాస్తులను పొందవచ్చని అన్నారు. కాళ్లకూరు వెంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి దేవాదాయ శాఖ మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. 20 రోజులలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ ఇఒ కోరారు.

## ఎంఎల్ఎను కలిసిన దాసాంజనేయ స్వామి దేవస్థాన పాలకవర్గం

**భీమవరం టౌన్:** భీమవరం శ్రీదాసాంజనేయ స్వామి దేవస్థానం నూతన పాలకవర్గ సభ్యులు బుధవారం రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులును మర్యాద పూర్వకంగా కలిశారు. ఆలయ అధ్యక్షులుగా దారపురెడ్డి త్రివిక్రమ్, సభ్యులు వేలూరి సుబ్రహ్మణ్యం, మెంటే మనోజ్ కుమార్, యర్రంశెట్టి గౌతమ్, యియ్యపు మాధవి, వేపాడ లక్ష్మి, ములుగుర్తి శ్రీనివాసరావు, గంధం రాధ నియమితులయ్యారు. ఇచ్చిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించి ఆలయాభివృద్ధికి కృషి చేయాలని ఎంఎల్ఎ తెలిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవాలయంలో ఏర్పాట్లు చూడాలన్నారు.

## ఎంపిటిసి ఆశాలత కుటుంబానికి పరామర్శ

**పెనుమంట్ర** : ఆలమూరు ఎంపిటిసి పలివెల ఆశాలత తండ్రి రాపాక ప్రసాద్ మంగళవారం మృతిచెందారు. ఈ సందర్భంగా బుధవారం పెనుమంట్ర ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి(వాసు), మండలంలోని అన్ని గ్రామాల ఎంపిటిసిలు, పలువురు సర్పంచులు ఆశాలత ప్రేమ్ కుమార్ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయనతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, నాయకులు కూడా హాజరై కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆశాలత తండ్రి మరణం గ్రామానికి పెద్ద లోటు అని, కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## కరుగోరుమిల్లి వైసిపి గ్రామ అధ్యక్షులుగా అమ్మన్నాయుడు

ప్రజాశక్తి - ఆచంట

వైసిపిని బలోపేతం చేసేందుకు గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షులు జక్కంశెట్టి చంటి అన్నారు. కరుగోరుమిల్లి గ్రామంలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులుగా ముత్యాల అమ్మన్నాయుడు నియమించినట్లు వైసిపి మండల కన్వీనర్ జక్కంశెట్టి చంటి తెలిపారు. ఈ సందర్భంగా వైసిపి సీనియర్ నేత సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆదేశాల మేరకు గ్రామస్థాయిలో వైసిపిని బలోపేతం చేయడమే లక్ష్యంగా గ్రామ కమిటీలు వేయడం జరుగుతుందన్నారు. వైసిపి సీనియర్ నాయకులు ముత్యాల నాగేశ్వరరావు మాట్లాడుతూ కరుగోరుమిల్లి గ్రామంలో ఖాళీ ప్రదేశాలు ఎక్కడ ఉన్నా ఇసుక గుట్టలతో నిల్వ చేశారని ఆరోపించారు. అక్రమంగా తరలించిన ఇసుక గుట్టలను రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు అధిక ధరకు సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన సంవత్సరకాలంలో కొత్తగా ఒక్క పింఛన్ కూడా మంజూరు చేయకపోవడమే కాకుండా సుమారు లక్ష పింఛన్‌లు తొలగించారని విమర్శించారు. గ్రామంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన బస్ షెల్టర్‌ను గ్రామ సర్పంచి తన సొంత ఖర్చులతో నిర్మించినట్టు పేర్లు వేయడం సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో 20 మందితో గ్రామ కమిటీ ఏర్పాటు చేశారు. వైసిపి సీనియర్ నేత కర్రి వేణుబాబు, నియోజకవర్గ ఎస్‌సి సెల్ అధ్యక్షులు పిల్లి రుద్ర ప్రసాద్, ఏనుములంక మాధవి, బొళ్ల బాబీ, పిప్పరపల్లి సుబ్బారావు, అయిల సత్యనారాయణ, కొక్కిరి రాంబాబు, దాసిరెడ్డి గంగాధర రావు పాల్గొన్నారు.

## మందులు, నిత్యావసరాలు అందజేత

**పాలకొల్లు** : పాలకొల్లు 23వ వార్డు రామారావుపేటకు చెందిన అంబళ్ల లక్ష్మికి భర్త లేడు. చేతికి అంది వచ్చిన ఇద్దరు కొడుకులు అనారోగ్యం వల్ల మతి తప్పి ప్రవర్తిస్తున్నారు. కుటుంబ జీవనం కష్టంగా మారింది. ఆ కుటుంబ పరిస్థితి తెలిసిన వారు వాకర్స్ క్లబ్, పాలకొల్లు దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించిన క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు క్లబ్ తరపున రూ.5 వేల మందులతో పాటు 4 వేల విలువైన నిత్యావసరాలను క్లబ్ సభ్యులతో కలిసి ఆ కుటుంబానికి బుధవారం అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, కోశాధికారి పోతుల ఉమాశంకర్ రావు, జవ్వాజి కల్యాణ్, ఎండి శ్రీనివాస్ పాల్గొన్నారు.



# పలు చట్టాలపై అంగన్వాడీలకు అవగాహన



పెనుమంట్ర : అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - గణపవరం

అంగన్వాడీ కార్యకర్తలకు బుధవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కె.ఓంకార్ నాద్ మాట్లాడుతూ కేన్సర్ వ్యాధి వంశపారంపర్యంగా లేదా జన్యు పరంగా వస్తుందని చెప్పారు. అంతేకాకుండా వృత్తిపరంగా కూడా కేన్సర్ వస్తుందని చెప్పారు. కేన్సర్ వచ్చిన వారికి బరువు తగ్గుతుందని, ఆకలి మందగిస్తుందని, విరేచనాలు, రక్తంపడటం, కండరాలు బలహీనపడడం వంటి లక్షణాలు కనపడతాయని చెప్పారు. ముఖ్యంగా ఆహార పదార్థాల ద్వారా కూడా వ్యాధి సంక్రమిస్తుందన్నారు. వ్యాధిని ముందుగా గుర్తించినట్లయితే పూర్తిగా నయం చేసుకోవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో సిహెచ్ఒ జాలాది విల్సన్ బాబు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**పెనుమంట్ర** : అంగన్వాడీ కార్యకర్తలందరూ ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన, గర్భస్థ శిశులింగ నిర్ధారణ పరీక్ష నిషేధం చట్టం, బాల సంజీవని యాప్ వినియోగంపై అవగాహన పొందాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ అంగర కృష్ణకుమారి అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రాంగణంలో అంగన్వాడీలకు యాప్ వినియోగంపై ఆమె శిక్షణ ఇచ్చారు. ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన లబ్ధిదారులు నమోదు విధానం, అర్హత వివరాలు తెలుపుతూ ఈ పథకం కింద నమోదు చేయడానికి ఖచ్చితంగా 18 సంవత్సరాల 7 నెలలు పూర్తి అయి ఉండాలన్నారు. లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమన్నది అందరికీ వివరించడం అందరి బాధ్యత అన్నారు. ఈ చట్టంలోని నిబంధనలు మొదటి సారి ఉల్లంఘించిన వైద్యులు, నిపుణులు, ఇతరులకు మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధించబడుతుందన్నారు. ఎవరూ లింగ నిర్ధారణ పరీక్షకు ప్రయత్నించరాదని తెలియజేశారు. కార్యక్రమంలో హెల్త్ డిపార్ట్మెంట్ ప్రతినిధి మల్లేశ్వరరావు, అంగన్వాడీ సూపర్‌వైజర్ ఎస్.వెంకట లక్ష్మీ, హై స్కూల్ హెచ్ఎం లింగం శారద పాల్గొన్నారు.

**ఉండి** : మిషన్ శక్తి అనేది మహిళల భద్రతకు, రక్షణకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అద్భుతమైన పథకమని ఐసిడిఎస్ ఆకివీడు సిడిపిఒ వాణి విజయరత్నం అన్నారు. బుధవారం ఉండి మండల పరిషత్ కార్యాలయంలో అంగన్వాడీలకు మిషన్ శక్తి పథకంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పి.లక్ష్మి సునంద మాట్లాడుతూ మహిళల్లో వచ్చే కేన్సర్ల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకుని తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం సిడిపిఒ వాణి విజయరత్నం మాట్లాడుతూ ఈనెల రెండో తేదీ నుంచి 12వ తేదీ వరకు వివిధ రూపాలలో సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అంగన్వాడీలు వారి పరిధిలో విస్తృత ప్రచారం చేయాలన్నారు. అంగన్వాడీ సూపర్వైజర్లు బాలా కుమారి, వి.నిర్మల, పి. మేరీ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

**ఆకివీడు** : లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట రీత్యా నేరమని, వాటి వల్ల జరిగే అనర్థాలను వారికి తెలియజేయాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వాణి విజయరత్నం వివరించారు. స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో బుధవారం ప్రాజెక్ట్ పరిధిలో మూడు మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలకు గర్భస్థ శిశువుల సంరక్షణ చట్టాలు, కేన్సర్‌లపై అవగాహన సదస్సు నిర్వహించారు. సూపర్‌వైజర్ రత్నకుమారి, సిబ్బంది, అంగన్వాడీలు పాల్గొన్నారు.

**పెనుగొండ రూరల్** : మండలంలోని పెనుగొండ గ్రామం చెరుకువాడ జెడ్‌పిహెచ్ఎస్ స్కూల్లో ఐసిడిఎస్ ఆధ్వర్యాన పిఎంఎంవివై, లింగ నిర్ధారణ చట్టం గురించి అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జి.సుజాత, ఎంవి.రూతు కుమారి, అంగన్వాడీలు పాల్గొన్నారు.

**నరసాపురం** : మిషన్ శక్తి సంకల్ప కార్యక్రమంలో భాగంగా బుధవారం నరసాపురం ఎంపిడిఒ కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. పిల్లల దత్తత, బాల్య వివాహ నిరోధక చట్టంపై జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ నెహెమియా వివరించారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎన్.పద్మావతి లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని అవగాహన కల్పించారు.

**మొగల్తూరు** : మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై, తీసుకోవలసిన జాగ్రత్తలు, చట్టాలపై సిడిపిఒ బి.ఊర్మిళ అవగాహన కల్పించారు. మొగల్తూరులో మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని మిషన్ శక్తి సంకల్ప కార్యక్రమంలో భాగంగా బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.